క్లుప్తంగా

ఎంఈవో ఇంటింటి ప్రచారం



జగ్గయ్యపేట: మండలంలోని అనుమంచిపల్లి, తిరుమలగిరి గ్రామాలలో సోమవారం ఎంఈవో– 2 చిట్టిబాబు 'మా బడికి రండి' కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలోని ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లటం వల్ల కలిగే ప్రయోజనాలు, వసతులను వివరించారు. అనుమంచిపల్లిలో 16 మంది విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌బాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సీఐ వెంకటేశ్వర్లు



జగ్గయ్యపేట అర్బన్: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ పి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కమిషనర్ ఉత్తర్వుల మేరకు, నందిగామ ఏసీపీ ఆదేశాలతో సోమవారం పేట పట్టణంలోని సీఐ కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా 15 బ్యాంకుల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు బ్యాంకుల ద్వారానే ఎక్కువగా జరుగుతూ ఉండటం వలన ప్రజలను అప్రమత్తం చేస్తూ బ్యాంకుల ద్వారా జరిగే ఆర్థిక నేరాలను అరికట్టాలని బ్యాంకు అధికారులకు సీఐ సూచించారు. జిల్లా అధికారులు ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టారని, అయినప్పటికీ సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. సైబర్ నేరాలను పూర్తిగా నియంత్రించాలంటే బ్యాంకుల సహకారం తప్పకుండా ఉండాలని కోరారు. బ్యాంకు అధికారులు బాధ్యతగా పనిచేస్తేనే సైబర్ నేరాలు కొంత వరకు అదుపు చేయవచ్చని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ జి.రాజు, చిల్లకల్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

చాట్రాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరతో రబీ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 17 తేమ శాతం ఉన్న ఏ గ్రేడ్ ధాన్యాన్ని క్వింటా రూ.2,320, కామన్ రకం ధాన్యం రూ.2,300 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మొక్కజొన్న పంట 90 శాతం కోతలు పూర్తయ్యాయని, మొక్కజొన్న వ్యర్థాలను తగలపెట్టవద్దని సూచించారు. 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట ఎరువులు జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృత్తి విద్యా శిక్షణ పొందిన బాలికలకు సర్టిఫికెట్లు



మూలపాడు(ఇబ్రహీంపట్నం):మూలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్తివిద్యా శిక్షణలో భాగంగా అగ్రికల్చర్ ఇంటర్న్‌షిప్ పూర్తిచేసిన టెన్త్‌క్లాస్ బాలికలకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం దేవిడ్ రాక్‌ఫెల్లర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజంలోని వివిధ వృత్తులపై అవగాహన పెంచుకోవడం ద్వారా త్వరగా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చన్నారు. వృత్తివిద్య శిక్షణకు ముందుకొచ్చిన వారిని అభినందించారు. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, నాన్సీ, సీఆర్పీ డి.నాగేశ్వరరావు, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

చాట్రాయి: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చీపురుగూడెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేశామని, ఈ దాడుల్లో బొర్రా శ్రీను అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం:హైవే పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్ర గాయాలతో విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న చింతపల్లి రాజు (35) సోమవారం మృతి చెందాడు. మండలంలోని మూలపాడు వద్ద ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగిన విషయం తెలిసిందే. గొల్లపూడిలోని తన కుమార్తెను తీసుకొచ్చేందుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. మృతుడు రాజుకు 11 ఏళ్ల కుమార్తె ఉంది. భార్య గతంలోనే మరణించగా, ఇప్పుడు తండ్రి కూడా మృతి చెందడంతో తల్లిదండ్రుల ఆదరణకు నోచుకోలేని అనాథగా బాలిక మారింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కరకట్ట నిర్మాణమయ్యేనా?



కరకట్ట నిర్మించాల్సిన ప్రతిపాదిత స్థలం



గ్రామంలో ట్రాఫిక్ కష్టాలు

- పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ కష్టాలు
- ఎదురు చూస్తున్న ప్రజలు

పెనుగంచిప్రోలు:రాష్ట్రంలోనే అతిపెద్ద దేవాలయాల్లో ఒకటి పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయం. ఉత్సవాల సమయంతో పాటు నిత్యం వచ్చే భక్తులు ఏడాదికి 50 లక్షల మంది వరకు ఉంటారు. పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. గ్రామానికి అమ్మవారి దర్శనం కోసం వేల సంఖ్యల్లో వాహనాల్లో భక్తులు వస్తుంటారు. అయితే గ్రామంలో ఆలయానికి వెళ్లే రహదారులు మొత్తం ఇరుకుగా ఉండటంతో నిత్యం గ్రామంలో ట్రాఫిక్ సమస్యతో పాటు వాహనదారుల బాధలు వర్ణనాతీతంగా మారాయి.

కరకట్ట కోసం ఎదురు చూపులు...

గడిచిన పదిహేనేళ్లుగా మునేరు పక్కన కరకట్ట నిర్మాణం కోసం ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అమ్మవారి దర్శనానికి భక్తుల సంఖ్య పెరగటంతో పాటు వాహనాల సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. మునేరు అవతల మామిడి తోటలు, ఫంక్షన్‌హాల్స్, ఏసీ గదులు ఏర్పడ్డాయి. సౌకర్యాలు పెరగటంతో భక్తుల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. గతంలో ఆలయ ఈఓగా పనిచేసిన చంద్రశేఖర్ ఆజాద్ కరకట్ట నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినా నిధుల లేమితో ఆగిపోయింది. 2016లో పెనుగంచిప్రోలు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కరకట్ట నిర్మాణ ఉపయోగాలను తెలియజేశారు. దీనిపై సీఎం వెంటనే జలవనశాఖాధికారులను ఆదేశించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు అధికారులు సర్వే చేసి 1200 మీటర్ల మేర కరకట్ట నిర్మించాలని, రూ.16 కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. తరువాత నిధులు చాలవని రకరకాల కారణాలతో కరకట్ట నిర్మాణ ప్రక్రియ నిలిచిపోయింది. ట్రాఫిక్ సమస్య మొదటికి వచ్చింది.

నిత్యం ట్రాఫిక్ కష్టాలు...

గ్రామం మొత్తం ఇరుకు రోడ్లు కావటంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా శుక్ర, ఆదివారాల్లో వందలాది వాహనాలతో రోడ్లు మొత్తం నిండిపోతున్నాయి. దీంతో భక్తులతో పాటు గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలన్నీ అధిగమించటానికి మునేరు పక్కన కరకట్ట నిర్మాణం ఒక్కటే పరిష్కారంగా ఉంది. మునేరు కాజ్‌వే పక్క నుంచి ఆలయం ముందు వరకు కరకట్ట నిర్మాణం జరిగితే గ్రామంలో ట్రాఫిక్ సమస్య ఉండదు. వాహనాలు కరకట్ట మీదుగా ఆలయం వరకు వెళ్తాయి. పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులు ఇరుకు రోడ్ల కారణంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఆలయం వరకు రహదారి మరీ కుంచించుకు పోయింది. పవిత్ర పుణ్యక్షేత్రానికి కరకట్టరోడ్డు నిర్మాణంపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొలతల ప్రకారం పని దినాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్

పోచంపల్లి(జగ్గయ్యపేట): ఉపాధి హామీ పథకం కూలీలకు కొలతల ప్రకారం పని దినాలు కల్పించాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. గ్రామంలోని సచివాలయం వద్ద సోమవారం ఉపాధి హామీ పథకం కూలీలు, మేట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు పనిని బట్టి వేతనాలు వస్తాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నాయని తెలిపారు. గ్రామాలలో గడ్డి, పండ్ల తోటల సాగుపై చిన్న, సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు రెండు సార్లు యాప్‌లో వివరాలు నమోదు చేయటం ఇబ్బందిగా ఉందని మేట్‌లు చెప్పారు. ఎండలు అధికంగా ఉంటున్నందున తాగునీరు, మజ్జిగ, టెంట్‌లు ఏర్పాటు చేయాలని కూలీలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఏపీవో రామకృష్ణ, సర్పంచ్ బూతుకూరి లక్ష్మీనాగిరెడ్డి, కార్యదర్శి మంగమ్మ, మేట్‌లు, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతన బకాయిలు చెల్లించాలి



ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కంచికచర్ల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు తక్షణమే వేతన బకాయిలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చేయాలని ఎంపీడీఓ బీఎం.విజయలక్ష్మికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనిచేసే కూలీలకు పని ప్రదేశాలలో మౌలిక వసతులు కల్పించాలని, సమ్మర్ అలవెన్స్ పునరుద్ధరించాలని కోరారు. పని కావాలని అడిగిన వారందరికీ పని కల్పించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ఈ పథకానికి నిధులు తగ్గించిందని, సమ్మర్ అలవెన్స్‌లు రద్దు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని ఆరోపించారు. ఎక్కువ పని చేసినప్పటికీ కూలీలకు తక్కువ వేతనం వస్తోందన్నారు. 100 రోజులు పనిచేసిన వారికి పనిముట్లు, ఇవ్వాలని కోరారు. జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ బీమా సౌకర్యం కల్పించి, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బెజ్జం భూషణం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధ్వానంగా పారిశుద్ధ్యం



షేర్‌మహ్మద్‌పేట ప్రధాన రహదారిపై మురుగు




లింగగూడెంలో రోడ్డుపై చేరిన మురుగు నీరు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. జిల్లా, మండల అధికారులు నెలలో మూడవ శనివారం తడిపొడి చెత్త సేకరించాలని, పారిశుద్ధ్యం, తదితర విషయాలపై ఆర్భాటం చేయటం తప్ప కింది స్థాయిలో ఆ మేరకు చర్యలు కరువయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేరుకు మేజర్ గ్రామంగా ఉన్నా పలుచోట్ల డ్రెయిన్‌లపై కల్వర్టులు లేకపోవటంతో పాటు డ్రెయిన్‌లలో పూడిక తీయకపోవటంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. రామచంద్రునిపేట రోడ్డు, రైస్‌మిల్లు ప్రాంతాలలో డ్రెయిన్‌లు లేకపోవటంతో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్గంధంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రహదారులు చిద్రంగా మారుతున్నాయని రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ, బీసీ కాలనీలలో సైతం డ్రెయిన్‌లలో పూడిక తీయకపోవటంతో దోమల బెడదతో రోగాల భారిన పడుతున్నామని వాపోతున్నారు. ఒత్తిడిచేసి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ఆ మేరకు మౌలిక వసతులు కల్పించటం లేదని విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్లపైనే మురుగు ప్రవాహం

లింగగూడెం(పెనుగంచిప్రోలు): మండలంలోని లింగగూడెం గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. గ్రామంలోని డ్రెయినేజీల్లో పూడిక తీయక పోవటంతో మురుగు నీరు అంతా రోడ్లపైనే పారుతోంది. మురుగు నీరు ప్రవహిస్తుండటంతో రోడ్లపై పిచ్చి మొక్కలు మొలుస్తున్నాయని, దోమలు వ్యాపిస్తున్నాయని గ్రామస్తులు అంటున్నారు. రామాలయం రోడ్డులో ఇళ్లల్లోని నీళ్లు మొత్తం రోడ్డుపైకి వస్తున్నాయని, తక్షణం అధికారులు స్పందించి మురుగు నీరు రోడ్డుపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనూష

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోళ్ళ అనూష అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. విద్యుత్ ఏఈ రామారావు మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు ఉంటే సత్వరమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ ఏఈ రాజు మాట్లాడుతూ గతంలో వచ్చిన వరదల కారణంగా 18 చెరువులకు గండ్లు పడ్డాయని, వాటికి మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. హౌసింగ్ ఏఈ సుందర్ కుమార్ మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా నిలిచిన గృహ నిర్మాణాలకు సంబంధించి బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం ఎంపీపీ అనూష మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండ వరదల రమేష్, డెప్యూటీ తహసీల్దార్ పవన్ కుమార్, ఏవో అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణం, అంకురారోహణ, నవగ్రహ పూజ, అగ్నిప్రతిష్టాపన, వాస్తుపూజ, ధ్వజారోహణ, శ్రీవారి ఆరాధన, తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మ, స్వామి వారిని అర్చకులు పరాశరం పవన్‌కుమార్ ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హనుమేశ్వరరావు, సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రీ సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలి

గోకరాజుపల్లి(వీరులపాడు): భూముల రీ సర్వేను సిబ్బంది నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దార్ హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని గోకరాజుపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలిగించవద్దన్నారు. రైతులకు, సర్వే సిబ్బందికి మధ్య వ్యత్యాసాలుంటే వాగ్వాదాలకు పోకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు కూడా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. రీ సర్వే వల్ల భూముల వివాదాలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఆగిరిపల్లి: మండలంలోని ఈదర ఆదర్శ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు మక్కే వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐదుగురు విద్యార్థులను నవోదయకు అర్హత సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయుడు యాదల రవిని ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనందబాబు సన్మానించారు. అనంతరం నవోదయకు ఎంపికైన ఐదుగురు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలరావు రూ.3 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొండపాటి అనిత, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శారద, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నవోదయకు ఎంపికై నగదు స్వీకరించిన విద్యార్థులతో ఎంఈఓలు, హెచ్ఎం

హామీల అమలుపై పోరాటాలకు సిద్ధం

–రాష్ట్ర రజక సంఘం నాయకుల డిమాండ్



ఇబ్రహీంపట్నం: కూటమి ప్రభుత్వం రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పోరాటాలకు సిద్ధపడాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర 7వ మహాసభలు సందర్భంగా రెండోరోజు స్థానిక ఎంవీఆర్ కళ్యాణ మండపంలో ప్రతినిధుల మహాసభ సోమవారం జరిగింది. 16 జిల్లాల నుంచి 180 మంది ప్రతినిధులు చర్చలకు హాజరయ్యారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం తెస్తామని చెప్పిన ప్రభుత్వం 11 నెలలుగా ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రజకులపై దాడుల నివారణకు అట్రాసిటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రజక కార్పొరేషన్ ద్వారా రూ.1,000 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన రజక వృద్ధులకు పింఛను మంజూరు చేయాలని కోరారు. పలు తీర్మానాలు ఆమోదించారు. 45 మందితో నూతన పాలకవర్గం కమిటీ ఎన్నుకున్నారు. పలువురు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్వీర్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం అనాలోచిత విధానాల వలన విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతోందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, గోరుముద్ద, ఇంగ్లిషు మీడియం, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులతో ప్రభుత్వ పాఠశాలలను రూపొందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దుక్కుతుందన్నారు. నాడు– నేడు మూడు ఫేజ్‌లలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించాన్నారు. కూటమి ప్రభుత్వంలో మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని చెప్పి విద్యా విధానంలో తీసుకువస్తున్న అనేక మార్పులు విద్యార్థులను విద్యకు దూరం చేసేలా ఉన్నాయని ఆరోపించారు. యూపీ స్కూల్స్‌ను కుదించి 6,7,8 తరగతుల వారు దగ్గరలో ఉన్న హైస్కూల్స్ వెళ్లేలా చేశారన్నారు. పేట నియోజకవర్గంలో ఉన్న 17 యూపీ స్కూళ్లను కుదించారని తెలిపారు. దీంతో పక్క గ్రామాలకు 6,7,8 తరగతుల విద్యార్థులు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఉన్న పాఠశాలలను అప్ గ్రేడ్ చేయాల్సింది పోయి డీ గ్రేడ్ చేయడం దారుణం అన్నారు. ఎంఈవోల నివేదికలను తెప్పించుకొని ఈ నిర్ణయం మార్చుకోవాలన్నారు. ఈ నియోజకవర్గంలో ఎక్కడా యూపీలను డీ గ్రేడ్ చేయడానికి వీల్లేదని, ఉన్న యూపీ స్కూళ్లను హైస్కూల్స్‌గా ప్రమోట్‌చేయాలన్నారు.

పాఠశాలలను పెంచాలిగానీ తగ్గించడానికి వీల్లేదని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేదంటే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తల్లిదండ్రులను కలుపుకుని పోరాటం చేస్తామని తెలిపారు. డీఎస్సీలో కూడా 50 శాతం కటాఫ్ మార్కుల నిబంధనను తొలగిస్తూ పునరాలోచన చేయాలని, అర్హత ఉన్న అందరికీ పోటీ పరీక్ష రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన నాయకులు

ఆస్తి పన్ను చెల్లించి రాయితీ పొందాలి



ఆస్తిపన్ను చెల్లించిన తుమ్మేపల్లిని సత్కరిస్తున్న కమిషనర్ రమణబాబు

నందిగామ టౌన్: ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి రాయితీలు పొందాలని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ 2025– 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్నులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా ఒకేసారి చెల్లించి ఐదు శాతం రాయితీ పొందాలన్నారు. అదే విధంగా 2024– 25కు సంబంధించి ఆస్తి పన్నుల బకాయిలను ఏకమొత్తంగా చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరులోగా చెల్లించి రాయితీలు పొందాలన్నారు. మొండి బకాయిదారులకు పలుమార్లు నోటీసులు జారీ చేసినా పన్నులు చెల్లించటం లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పట్టణానికి చెందిన తుమ్మేపల్లి అనంత సూర్యప్రకాష్ 2025– 26కు సంబంధించి ఆస్తిపన్ను రూ. 1.50 లక్షలను చెల్లించి ఐదు శాతం రాయితీ పొందారని చెప్పారు. ఏక మొత్తంలో పన్ను చెల్లించిన ఆయనకు కమిషనర్ చిరు సత్కారం చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 15 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ

నందిగామ రూరల్: ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిష్కార వేదికకు ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 15 అర్జీలు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఎనిమిది, పంచాయతీ రాజ్ ఒకటి, సర్వే డిపార్ట్‌మెంట్‌కు నాలుగు, విద్యుత్ శాఖ ఒకటి, పౌరసరఫరాల శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. ఈ అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపి తక్షణమే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం



సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య



పెనుగంచిప్రోలు అంగన్‌వాడీ కేంద్రంలో..

జగ్గయ్యపేట అర్బన్: గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) అన్నారు. సోమవారం స్థానిక ఉక్కు కళావేదికలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్, చిల్లకల్లు వారు పౌష్టికాహార పక్షోత్సవం సీమంతాల వేడుక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి ఎమ్మెల్యే తాతయ్య గర్భిణులకు, బాలింతలకు, తల్లులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిరు ధాన్యాలలో అత్యధిక పోషక విలువలు ఉంటాయని తెలిపారు. రక్తహీనత, చిరుధాన్యాలపై అంగన్‌వాడీ అధికారులు అవగాహన కల్పించారు. అనంతరం పలువురికి సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ హఫీజున్నీసా, ఏసీడీపీవో నాగమణి, నాయకులు, కౌన్సిలర్లు, సూపర్‌వైజర్లు రజనీజ్వాల, శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

పెనుగంచిప్రోలు: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యకరమైన స్నాక్స్ తెచ్చుకుని పంచుకోవాలన్నారు. టెలివిజన్, మొబైల్స్‌తో గడిపే సమయాన్ని తగ్గించుకుని ఎక్కువ సమయాన్ని బహిరంగ ఆటలు, కుటుంబాలతో గడపాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సువర్చల, జయలక్ష్మి, విమల, మంజుల, రాజ్యలక్ష్మి, ఝాన్సీ, కల్పన, భవాని, తదితరులు పాల్గొన్నారు.